క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కెరమెరి: సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ రమేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. 33 కేవీ విద్యుత్ కెరమెరి ఫీడర్ మరమ్మతుల కారణంగా రెండు గంటల విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

రెగ్యులర్ తహసీల్దార్‌ను నియమించాలి


మాట్లాడుతున్న వెంకటేశ్

కెరమెరి: మండలానికి రెగ్యులర్ తహసీల్దార్‌ను నియమించాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి మండలాధ్యక్షుడు పొర్ల వెంకటేశ్ డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇన్‌చార్జి తహసీల్దార్ పాలన కొనసాగడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ విషయమై జిల్లా కేంద్రంలో కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజాఫిర్యాదుల విభాగంలో వినతిపత్రం అందజేస్తామన్నారు. కార్యక్రమంలో మైను, శంకర్, సాయి, బాపూరావు తదితరులు ఉన్నారు.

సీఎం సహాయనిధితో పేదలకు మేలు

వాంకిడి: సీఎం సహాయనిధితో పేదలకు మేలు జరుగుతుందని కాంగ్రెస్ పార్టీ ఆసిఫాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్యాంనాయక్ అన్నారు. వాంకిడి మండలంలోని జంబుల్‌ధరి గ్రామానికి చెందిన చౌదరి హరిదాస్‌కు సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.60,000 చెక్కును ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపదలో ఆసుపత్రుల పాలైన నిరుపేదలకు సీఎం సహాయ నిధి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎండీ నిజాం, సుదర్శన్ గౌడ్, సోమశేఖర్, శ్రీను, అజేయ్ జేశ్వాల్ తదితరులు పాల్గొన్నారు.

భగీరథ పైపులు చోరీ


చోరీకి గురైన పైపులు

చింతలమానెపల్లి: మండలంలోని గూడెం సమీపంలో మిషన్ భగీరథ పైపులను గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనం చేసినట్లు ఆదివారం కోయపల్లి గ్రామస్తులు తెలిపారు. గూడెం నుంచి కోయపల్లి గ్రామానికి తాగునీటిని సరఫరా చేసే మిషన్ భగీరథ పైపులను దొంగలు ఎత్తికెళ్లారు. ఇటీవల వచ్చిన వరదలకు మిషన్ భగీరథ పైపులు పైకి తేలాయి. దీంతో చోరీకి గురవడంతో కోయపల్లి గ్రామానికి నీటి సరఫరా నిలిచిపోయింది.

రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలి


మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో సీతారాం

రెబ్బెన: ప్రతిఒక్కరూ రక్తదానం చేసి ప్రాణదాతలు గా నిలవాలని డీఎంహెచ్‌వో సీతారాం అన్నారు. మండలంలోని గోలేటిలో ఆదివారం సేవాలాల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. గ్రామానికి చెందిన సుమారు 30 మంది యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేశా రు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ అత్యవసర సమయంలో రక్తం దొరకక రోగులు ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. అలాంటి వారికి స్వచ్ఛందంగా రక్తదాతలు అందించే రక్తం ప్రాణాలు నిలుపుతుందన్నారు. రక్తదానంతో ఎ లాంటి నష్టం ఉండదన్నారు. సేవాలాల్ చారిటబు ల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో భవిష్యత్తులో మరిన్ని శిబిరా లను ఏర్పాటు చేసి, తలసేమియా వ్యాధిగ్రస్తులకు అవసరమైన రక్తం అందించేందుకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో రెబ్బెన సీఐ సంజయ్, గ్రామస్తులు అజ్మీర బలరాంనాయక్, లావుడ్య దుప్పానాయక్, రాజునాయక్, అజ్మీర బాబురావు, అజ్మీర ఆత్మారాం నాయక్, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

దుర్గామాత మండపాలు ముస్తాబు

- నేటి నుంచి దేవీనవరాత్రి ఉత్సవాలు


వార్డు నం 22లో విద్యుత్‌దీపాలతో అలంకరించిన దుర్గామాత మండపం

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలో దుర్గాదేవి నవరాత్రోత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్నారు. వివిధ ఆలయాలు, కూడళ్ల వద్ద సోమవారం దుర్గా, శారదామాతను ఏర్పాటు చేసేందుకు నిర్వాహకులు మండపాలను సిద్ధం చేస్తున్నారు. శరన్నవరాత్రులు పురస్కరించుకొని తొమ్మిది రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు.

కేశవనాథ ఆలయంలో..

జిల్లా కేంద్రంలోని కేశవనాథ ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. నవరాత్రులు పురస్కరించుకొని ఆలయాన్ని విద్యుద్దీపాలతో శోభాయమానంగా అలంకరించారు. ఆలయంలో ప్రతిరోజు ఉదయం స్వామి వారికి అభిషేకంతో పాటు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. నిత్యం భజనతో పాటు సామూహిక విష్ణుసహస్రనామ పారాయణంతో పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఐదు రోజుల పాటు ప్రతీరోజు రాత్రి స్వామి వారిని వివిధ వాహనాల్లో ఊరేగింపు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఐదో రోజు స్వామి వారిని పల్లకి సేవతో ఊరేగిస్తారు. 6వ రోజు శేషసాయి వాహనం, 7వ రోజు గుర్రపు వాహనం, 8వ రోజు పొన్న చెట్టు వాహనం, చివరి రోజు ఏనుగు వాహనంపై స్వామి వారిని ఊరేగిస్తారు. కార్యక్రమాలకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కావాలని ఆలయ కమిటీ అధ్యక్షుడు మనోజ్ వైరాగరే కోరారు.

ప్రతిష్ఠాపనకు సిద్ధం..

కెరమెరి: మండలంలోని వివిధ గ్రామాల్లో నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దుర్గాదేవి ప్రతిష్ఠాపనకు దుర్గామాత ప్రతిమలు, మండపాలు సిద్ధమవుతున్నాయి. ఆదివారం ఆయా మండపాల నిర్వాహకులు వివిధ పనుల్లో నిమగ్నమయ్యారు. మండల కేంద్రంతో పాటు గోయగాం, సాంగ్వి, ఇంద్రానగర్, అంతాపూర్, పద్మావతి, సావర్‌కెడా తదితర గ్రామాల్లో మొత్తం 30 దుర్గామాత ప్రతిమలను ప్రతిష్ఠించేందుకు ఏర్పాట్లు చేశారు. ప్రజలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పొడద్దని, సౌండ్‌బాక్సులు ఏర్పాటు చేయకూడదని ఎస్సై మధూకర్ హెచ్చరించారు.

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలోని మెయిన్ మార్కెట్, ఇందిరా మార్కెట్, ద్వారకానగర్, వార్డు నెం 22, న్యూకాలనీ, నజ్రుల్‌నగర్, దుర్గానగర్, రాంనగర్‌లో దుర్గామాత నవరాత్రి ఉత్సవాలకు ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో మండపాలను ముస్తాబ్ చేశారు. విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు.

మండపాలను పరిశీలించిన డీఎస్పీ

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపాలను కాగజ్‌నగర్ డీఎస్పీ వహీదుద్దీన్, సీఐ ప్రేంకుమార్ ఆదివారం పరిశీలించారు. మండపాల నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. దుర్గామాత విగ్రహాలను తీసుకువచ్చే సమయంలో ఇబ్బందులు లేకుండా జాగ్రత్తగా పాటించాలన్నారు. అపరిచిత వ్యక్తులు వస్తే సమాచారం అందజేయాలని సూచించారు.

దహెగాం: శరన్నవరాత్రుల్లో భాగంగా మండల కేంద్రంతో ఆయా గ్రామాల్లో సోమవారం దుర్గాదేవిని ప్రతిష్ఠించనున్నారు. మండపాలను విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశారు. మండల కేంద్రంలోని స్థానిక శివాలయంలో మండపాన్ని అందంగా అలంకరించారు. ప్రతీ రోజు ప్రత్యేక కార్యక్రమాలు, నిత్యాన్నదానం ఏర్పాటు చేస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.


ఆసిఫాబాద్: విద్యుత్ దీపాల్లో కేశవనాథ ఆలయం


దహెగాంలో..


సూచనలు చేస్తున్న డీఎస్పీ వహీదుద్దీన్


కెరమెరి: తరలించేందుకు సిద్ధంగా ఉన్న ప్రతిమలు


జిల్లా కేంద్రంలో..

ఘనంగా బతుకమ్మ సంబరాలు


ఆసిఫాబాద్‌అర్బన్: బ్రాహ్మణవాడలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

ఆసిఫాబాద్‌అర్బన్: తెలంగాణ మహిళలు అత్యంత వైభవోపేతంగా జరుపుకొనే బతుకమ్మ పండుగ సంబరాలు ఆదివారం జిల్లా కేంద్రంలో అత్యంత ఘనంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజులో భాగంగా ఎంగిలి పూల బతుకమ్మను పేర్చారు. రంగురంగుల పూలతో పేర్చిన బతుకమ్మకు నువ్వులు, బియ్యం పిండితో నైవేద్యాన్ని తయారు చేసి భక్తితో సమర్పించారు. పట్టణంలోని శివకేశవమందిర్, సందీప్‌నగర్, జన్కాపూర్, బజార్‌వాడీ, టీఆర్‌నగర్, కసాబ్‌వాడీ, బ్రాహ్మణవాడతో పాటు పలు కాలనీల్లో మహిళలు బతుకమ్మలను పేర్చి పాటలు పాడుతూ, కోలాటం ఆడారు.

ఘనంగా ఎంగిలిపూల బతుకమ్మ

దహెగాం: ఆడపడుచులకు అత్యంత ఇష్టమైన పండుగ బతుకమ్మ. పూలను పూజించే పండుగ ఇది. తీరొక్క పూలను తీసుకొచ్చి బతుకమ్మను పేర్చి సంప్రదాయ పాటలను పాడుతూ.. నృత్యం చేస్తారు. ఆదివారం మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో ఎంగిలిపూల బతుకమ్మ సంబురాలను ఘనంగా నిర్వహించారు. మహిళలందరూ ఒక చోట చేరి చిన్నాపెద్దా తేడా లేకుండా బతుకమ్మ ఆడిపాడారు.

కౌటాల: కౌటాల మండలంలోని గ్రామాల్లో ఆదివారం బతుకమ్మ సంబురాలు ప్రారంభమయ్యాయి. మహిళలు తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామంలో బతుకమ్మ పాటలు పడుతూ బతుకమ్మ ఆడారు. దీంతో గ్రామాల్లో బతుకమ్మ సందడి నెలకొంది.


దహెగాం: బతుకమ్మ పేర్చుతున్న మహిళలు


బాపూనగర్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

టీయూడబ్ల్యూజే పోరాట ఫలితమే ఆంక్షలు ఎత్తివేత

బెజ్జూర్: ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో మీడియాపై ఆంక్షలు విధించిన నేపథ్యంలో టీయూడబ్ల్యూజే పోరాట ఫలితంతోనే కలెక్టర్, ఆస్పత్రి సూపరింటెండెంట్ ఆంక్షలు ఎత్తివేశారని టీయూడబ్ల్యూజే (ఐజేయు) జిల్లా సంయుక్త కార్యదర్శి బొజ్జ మహేశ్ అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మీడియా స్వేచ్ఛకు భంగం కలిగించే విధంగా ఆస్పత్రి అధికారులు నోటీసులు పెట్టడంపై తమ సంఘం ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించడంతో అధికారులు స్పందించి ఆంక్షలు ఎత్తివేశారని తెలిపారు. టీయూడబ్ల్యూజే (ఐజేయు) ఎల్లప్పుడూ జర్నలిస్టుల పక్షాన ఉంటూ హక్కుల పరిరక్షణ కోసం పోరాడుతుందని తెలిపారు.

అంగన్‌వాడీల్లో పోషణ మాసం


కోయచిచ్చాలలో నిర్వహిస్తున్న పోషణమాసం

- ప్రారంభమైన 4వ విడత కార్యక్రమం
- నెల రోజుల పాటు పోషణమాసం

పెంచికల్‌పేట్: పోషకాహార లోపాన్ని నివారించేందుకు, పోషకాహారం ప్రాముఖ్యతను ప్రతిఒక్కరికీ తెలియజేసేందుకు 4వ విడత పోషణమాసం కార్యక్రమాన్ని అధికారులు ప్రారంభించారు. మహిళాభివృద్ధి, శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈనెల 17న ప్రారంభమైన పోషణమాసం కార్యక్రమాన్ని అక్టోబర్ 16వరకు నిర్వహించనున్నారు. విద్య, వైద్య, ఐసీడీఎస్, ఐకేపీ సిబ్బంది సంయుక్తంగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

మండలంలో ఇలా..

మండంలోని 22 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వాటిలో 1 నుంచి 3 సంవత్సరాలు గల చిన్నారులు 544, 3 నుంచి 5 సంవత్సరాల వయస్సు కలిగిన వారు 658, గర్భిణులు 145, బాలింతలు 98, కిశోరబాలికలు 2360 ఉన్నారు. మామ్‌లో 35, సామ్‌లో 7, బరువు తక్కువ చిన్నారులు 98 మంది అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రతీ నెల పాలు, గుడ్లు, పోషకాహారం అందిస్తున్నారు.

వివిధ రకాల కార్యక్రమాలు..

ప్రభుత్వం ప్రతిఏటా అంగన్‌వాడీ కేంద్రాల్లో పెద్ద ఎత్తున పోషణమాసం నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు సీమంతం, చిన్నారులకు అక్షరాభ్యాసం, అన్నప్రాసన కార్యక్రమాలను ప్రజల భాగస్వామ్యంతో నిర్వహిస్తున్నారు. ప్రతిరోజు తీసుకునే ఆహారంలో పాలు, గుడ్లు, ఆకు కూరలు, పెసర్లు, మినుములు, నువ్వులు, రాగిజావా, బెల్లం, పల్లిపట్టీలు ఉండేలా చూసుకోవాలని అవగాహన కల్పిస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో వివిధ రకాల పోషకాహారాన్ని తయారు చేసి ప్రాముఖ్యతను తెలియజేస్తున్నారు.

ప్రచారం చేస్తున్నాం

పోషణమాసం కార్యక్రమాన్ని నెల రోజుల పాటు నిర్వహిస్తాం. గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో అన్ని శాఖల అధికారుల సమన్వయంతో మహిళలు, గర్భిణులకు, బరువు తక్కువ కలిగిన చిన్నారులకు, కిశోర బాలికలకు పోషకాహారం ప్రాముఖ్యతపైన అవగాహన కల్పిస్తాం. ప్రతి ఒక్కరికీ పోషకాహార ప్రాముఖ్యతను తెలియచేయటమే లక్ష్యంగా క్షేత్రస్థాయిలో ప్రణాళికను ఏర్పాటు చేశాము.

– హసీనా, ఐసీడీఎస్ సూపర్‌వైజర్, పెంచికల్‌పేట్

అడవిలో చెట్లు నరకడం చట్టవిరుద్ధం


కౌన్సెలింగ్ ఫొటోలు చూపుతున్న ఎఫ్‌డీవో

జన్నారం: అడవిలోని చెట్లు నరకడం చట్టవిరుద్ధమని జన్నారం ఫారెస్ట్ డివిజనల్ అధికారి రామ్మోహన్ అన్నారు. ఆదివారం టీడీసీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కవ్వాల్ టైగర్‌జోన్ కోర్ ఏరియాలో పాలఘోరీల ప్రాంతంలో సర్వే నంబర్ 112లో ఉన్న 9,631 ఎకరాల్లో తమ పూర్వీకుల భూమి ఉందని కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ యూ, జైనూర్, లింగాపూర్ మండలాలకు చెందిన ఆదివాసీ గిరిజనులు గతనెల 4న గుడిసెలు వేసుకుని ఉంటున్నారన్నారు. ఇట్టి భూమిపై ఆదివాసీలు ఆర్డీవోకు దరఖాస్తు చేసుకోగా 2005 డిసెంబర్‌కు ముందు పోడులో ఉన్న వారి వివరాల ప్రకారం 120 ఎకరాలను పంచగా మిగతా భూమి ఫారెస్టులో కలిసిందని అధికారులు రాతపూర్వకంగా వారికి తెలియజేశారన్నారు. శాంతియుతంగా వారితో మాట్లాడటమే కాకుండా పోలీసు, రెవెన్యూ అధికారులతో పలు మార్లు కౌన్సిలింగ్ కూడా ఇప్పించామన్నారు. అయినా వారిలో మార్పు రాకపోవడమే కాకుండా ఈనెల 18న రూ.3.50 లక్షల విలువైన 350 టేకుచెట్లను నరికారని, అడ్డుగా వెళ్లిన అటవీ సిబ్బందిపై కారంపొడి చల్లి కర్రలతో దాడికి పాల్పడ్డారన్నారు. వారి పై అటవీ నేరం, వన్యప్రాణుల చట్టం ప్రకారం కేసులు నమోదు చేశామన్నారు. అటవీ సిబ్బందిపై దాడికి పాల్పడిన 26 మందిని అరెస్ట్ చేసి ఆదివారం తెల్లవారుజామున లక్సెట్టిపేట కోర్టులో హాజరు పర్చగా న్యాయమూర్తి వారికి 14 రోజుల రిమాండ్ విధించినట్లు ఎఫ్‌డీవో పేర్కొన్నారు. సమావేశంలో రేంజ్ అధికారి సుష్మారావు, సిబ్బంది పాల్గొన్నారు.

కొండా లక్ష్మణ్ బాపూజీకి నివాళి


రెబ్బెన: నివాళులర్పిస్తున్న నాయకులు


బెజ్జూర్: నివాళులర్పిస్తున్న సంఘం నాయకులు


కాగజ్‌నగర్ టౌన్: నివాళులర్పిస్తున్న పద్మశాలిలు

రెబ్బెన: మండలంలోని గోలేటిలో పద్మశాలీ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ ఉద్యమనేత ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సంఘం వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు వీరస్వామి మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమం కోసం మంత్రి పదవిని త్యాగం చేసి ఉద్యమాన్ని ముందుండి నడిపించిన నేత కొండా లక్ష్మణ్ బాపూజీ అన్నారు. జిల్లాలోని మెడికల్ కళాశాలకు కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు పెట్టాలని డిమాండ్ చేశారు. వెల్ఫేర్ సొసైటీ ప్రధాన కార్యదర్శి మాంతు సమ్మయ్య, కోశాధికారి మారిన చందర్, మండల ఉపాధ్యక్షుడు అంకం కైలాసం, శ్రీపతి, నాయకులు రవీందర్, శ్రీనివాస్, సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

బాపూజీ సేవలు మరువలేనివి..

వాంకిడి: ఆచార్య కొండ లక్ష్మణ్ బాపూజీ చేసిన సేవలు మరువలేనివని పద్మశాలీ సంఘం మండల అధ్యక్షుడు ఒడ్డపల్లి సతీశ్ అన్నారు. ఆదివారం పద్మశాలీ సంఘ భవనంలో బాపూజీ 14వ వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. పద్మశాలీ సంఘం నాయకులు నాగుల మొండయ్య, రామకృష్ణ, ఎంగలి రాకేశ్ కుమార్, జంజిరాల భూమయ్య, చిప్ప సాయి, వేముల రాకేశ్, మచ్చ పవన్, పసుపునూరి పవన్ తదితరులు పాల్గొన్నారు.

బెజ్జూర్: ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతిని నిర్వహించారు. ఆదివారం మండల కేంద్రంలోని సంఘ భవనంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పద్మశాలి సంఘం మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సామల తిరుపతి, తనుకుట్ల వెంకటేశ్ మాట్లాడుతూ.. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన స్వాతంత్ర సమరయోధుడు, ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం పదవులను త్యాగం చేసిన పద్మశాలి ముద్దుబిడ్డ కొండా లక్ష్మణ్ బాపూజీ అని కొనియాడారు. నాయకులు పర్ష గణేష్, సామల జనార్ధన్, శంకర్, కూషణ శ్రీకాంత్, జగదీష్ పాల్గొన్నారు.

కాగజ్‌నగర్ టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలోని పద్మశాలి భవనంలో కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. బాపూజీ అడుగుజాడల్లో యువత నడువాలన్నారు. కార్యక్రమంలో సిందం చంద్రయ్య, గుల్లపల్లి ఆనంద్, రాపెల్లి సదానందం, నాగేశ్వర్‌రావు, మల్లయ్య, దోమల సురవర్ధన్, శ్రీనివాస్, నూతి సుదర్శన్, వొడ్నాల వెంకన్న, శంకర్, వెంకటేశ్ పాల్గొన్నారు.

రోడ్లపైనే పశువుల సంచారం


రోడ్లపై సంచరిస్తున్న పశువులు

బెజ్జూర్: కొంత మంది పశు యజమానులు మండల కేంద్రంలోని రోడ్లపైనే పశువులను వదిలేస్తున్నారు. దీంతో రాత్రి, పగలు అనే తేడా లేకుండా రోడ్లపై సంచరిస్తున్నాయి. ఈ కారణంగా పలు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. పశువుల యజమానులకు నోటీసులు అందించి కట్టడి చేయాలని ప్రజలు అధికారులకు వినతిపత్రాలు ఇచ్చినా.. పట్టించుకోకపోవడం లేదు. ఆదివారం వారసంత కావడంతో ప్రజలకు ఇబ్బంది తప్పడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని మండలవాసులు కోరుతున్నారు.

పేరుకుపోయిన చెత్తాచెదారం


గాంధీచౌక్‌లో రోడ్డుపై చెత్తచెదారం

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలోని ప్రధాన మార్కె ట్ ఏరియాలోని గాంధీ చౌక్ చుట్టపక్కల వారం రోజులుగా చెత్తాచెదారం తొలగించక పోవడంతో ఆ ప్రాంతం అంతా అధ్వానంగా మారింది. చెత్తాచెదారం పేరుకుపోయింది. దీంతో దుర్వాసన వెదజల్లుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

అల్లుకున్న నిర్లక్ష్యం



కాగజ్‌నగర్ పట్టణంలోని 22, 8 వార్డుల్లో విద్యుత్‌స్తంభాలకు తీగలు అల్లుకొని ప్రమాదకరంగా మారాయి. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఈ విషయం అధికారులకు విన్నవించినా.. పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

– కాగజ్‌నగర్ టౌన్